క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత స్వామి మాస్టారుని సత్కరిస్తున్న సీసలి గ్రామస్తులు

కాళ్ల: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గురువును గ్రామస్తులు శనివారం ఘనంగా సత్కరించారు. కాళ్ల మండలం సీసలి ప్రాథమిక పాఠశాల(స్పెషల్)లో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి సెప్టెంబర్ 5వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా 2023 అవార్డు అందుకున్నారు. గ్రామానికి రాష్ట్రస్థాయిలో పేరు తెచ్చిన స్వామి మాస్టారుని గ్రామస్తులు, ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాతు మాణిక్యాలరావు, విద్యా కమిటీ చైర్మన్ పి.రమేష్, చార్లెస్, రాజారత్నం, పండు, అమృతరావు, అబ్రహం, నతానీయేలు, యాకోబు, యేసు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టి చేతులతో బొజ్జ గణపయ్య



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల్ని తయారు చేస్తున్న ముస్లిం విద్యార్థినులు

ఆకివీడు: చిట్టి చేతులతో బొజ్జ గణపయ్య మట్టి విగ్రహాల్ని విద్యార్థులు తయారు చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీని నేర్పారు. దీంతో విద్యార్థులందరూ లంబోధరుడిని తయారు చేశారు. కుల మతాలకతీతంగా విద్యార్థులు భోళాశంకరుడి విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. మట్టి విగ్రహాల ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు ఉత్సాహంగా విగ్రహాల్ని తయారుచేశారు.

ఘనంగా అఖండ అన్నసమారాధన



గొల్లగూడెంలో కృష్ణాష్టమి సందర్భంగా అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: కృష్ణాష్టమి సందర్భంగా శనివారం అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మండలంలోని సిద్ధాపురం గ్రామ శివారులో గొల్లగూడెం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన జరిగింది. ఈ సందర్భంగా రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు.

పోషకాహారంపై అవగాహన



శృంగవృక్షంలో ప్రదర్శించిన పోషకాహారాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పాలకోడేరు: ఇంటి పెరట్లో పండించిన కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి మంచిదని పీడీ బి సుజాత రాణి అన్నారు. పోషన్ మహా కార్యక్రమంలో భాగంగా శృంగవృక్షంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ సుజాతరాణి మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనతను, పోషకాహార లోపాన్ని నివారించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగం సూరిబాబు, ఆకివీడు ప్రాజెక్ట్ సీడీపీవో వాణి విజయరత్నం, సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతిని గుర్తించడం హర్షదాయకం

ఆకివీడు: సృష్టి కర్త విరాట్ విశ్వ కర్మ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటించడం ఎంతో ఆనందదాయకమని స్వర్ణకార సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పట్నాల శేషగిరి రావు చెప్పారు. స్థానికంగా శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంచవృత్తిదారులను, ఇతర వృత్తిదారుల్ని గుర్తించి కార్మిక దినోత్సవంగా ప్రకటించడం ఆయా వృత్తిదారుల్ని గుర్తించడమేనని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టడం ద్వారా చేతి వృత్తిదారులకు ఎంతో మేలు జరుగనుందని చెప్పారు. ఆధునిక యంత్ర పరికరాలతో చేతివృత్తిదారులు పనులను కోల్పోయారని, ఈ తరుణంలో ప్రభుత్వాలు వృత్తిదారుల్ని ఆదుకోవడం శుభపరిణామమన్నారు.

చవితికి సిద్ధమవుతున్న మండపాలు



భీమవరంలో అమ్మకానికి సిద్ధంగా వినాయక మట్టి విగ్రహాలు



విస్సాకోడేరులో సిద్ధమైన మండపం

- మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ ప్రచారం
- ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి అంటున్న అధికారులు

సాక్షి, భీమవరం: వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు పట్టణాలు, గ్రామాల్లో హడావుడి నెలకొంది. ఇప్పటికే వేదికలు సిద్ధం కాగా, విగ్రహాలను నెలకొల్పేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పర్యావరణానికి హాని కలగకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని ప్రకృతి ప్రేమికులు చెబుతుండగా మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వినాయక చవితి వేడుకల నిర్వహణలో జిల్లాకు ఓ ప్రత్యేకత ఉంది, భీమవరం, పాలకొల్లు, సిద్ధాంతం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట తదితర ప్రాంతాల్లో కలకత్తా, గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాల నుంచి వచ్చిన శిల్ప కళాకారులు ప్రత్యేకంగా షెడ్లు వేసుకుని తొమ్మిది నెలల ముందు నుంచే విగ్రహాల తయారీని ప్రారంభిస్తారు. వీరు రూపొందించిన విగ్రహాలు ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన మండపాల వేదికల వద్ద ప్రతిష్ఠిస్తుండగా గృహాల్లో పూజించుకోడానికి మట్టి ప్రతిమలను వివిధ స్వచ్ఛంద, ఆధ్యాత్మిక, ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

పర్వదిన పరమార్థమిదే..

ప్రతి శుభకార్యానికి ముందుగా గణపతిని పూజించడం హిందువులకు పరిపాటి. పంచభూతాల్లో ఒకటైన మట్టితో చేసిన వినాయకుని ప్రతిమలను పూజించడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని పండితులు చెబుతున్నారు.

వివిధ రకాల ఆకులు, పుష్పాల సువాసనల నుంచి మిశ్రమ వాయువులను పీల్చడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు దూరం కావడంతో పాటు మెదడు ఉత్తేజితం అవుతుంది. ప్రకృతి సిద్ధమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించడం, తిరిగి వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో అవి నీటిలో సులువుగా కరిగి పంట పొలాలకు చేరడంతో భూములు సారవంతం అవుతాయని నమ్మకం. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిసుతో చేసిన ప్రతిమలు నీటిలో ఆలస్యంగా కరిగే గుణం ఉంది. ప్రతిమల్లో జిప్సం, సీసం, కాడ్మియం, గంధకం, మెగ్నీషియం, పాదరసం వంటి విష రసాయనాలు నీటిలో చేరినపుడు అందులోని ఆక్సిజన్‌ను తగ్గించి ఆమ్లత్వాన్ని పెంచుతాయని పర్యావరణ నిపుణుల చెబుతున్నారు.

ఉత్సవాలకు సిద్ధమవుతున్న మండపాలు

ఈనెల 18వ తేదీన ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలకు పట్టణాలు, గ్రామాల్లో మండపాలు సిద్ధం చేస్తున్నారు. వర్షానికి తడిచిపోని విధంగా వాటర్‌ప్రూఫ్ బరకాలతో పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. అలాగే భవన నిర్మాణానికి ఉపయోగించే సెంట్రింగ్ ఇనుప రేకులు, రాడ్లతో స్టేజిలను నిర్మిస్తున్నారు. మట్టి విగ్రహాలనే పూజించాలని ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు.

అనుమతులు తప్పనిసరి



వినాయక ఉత్సవాలు నిర్వహించే మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. తొమ్మిది రోజులపాటు నిర్వహించే గణపతి నవ రాత్రుల్లో ప్రతి రోజూ నిర్వహించే దూప, దీప, నైవేద్యాల సమయంలో ఎటువంటి అగ్నిప్రమాదాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద డిబ్బీల దొంగతనం జరగకుండా కమిటీ సభ్యులు నిత్యం కాపలాగా ఉండాలి. నిమజ్జనం సమయంలో డీజేలు ఏర్పాటు చేసి మితిమీరిన శబ్దకాలుష్యానికి కారకులు కాకుండా సంప్రదాయబద్ధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. గొడవలకు ఆస్కారం ఇవ్వకూడదు. – యు.రవిప్రకాష్, ఎస్పీ, భీమవరం

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహనిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

ఆకివీడు: గ్రామాల్లోనూ, జగనన్న కాలనీలో మంజూరైన ఇళ్లను వెంటనే నిర్మాణం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ ఎం. వేణుగోపాల్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ హాల్‌లో శనివారం గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునాదులు కూడా తీయని వారితో పునాదులు తీయించి నిర్మాణ పనులు చేపట్టాలని, నిర్మాణ దశలో ఉన్న భవనాల్ని వెంటనే పూర్తి చేసే విధంగా సచివాలయ ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్న కాలనీలో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకుడు గుంతకు రూ. 6 వేలు ప్రభుత్వం అందజేస్తుందని వేణుగోపాల్ చెప్పారు. నగర పంచాతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో 1500 ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని, వారితో త్వరితగతిని పునాదులు తీయించి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కె.వాణీ, హౌసింగ్ డీఈ విశ్వనాథరాజు, ఏఈ భాస్కరరాజు, నగర పంచాయతీ కమిషనర్ కృష్ణ మోహన్, ఏఓ శ్రీకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను రక్షించుకుందాం



వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఆకివీడు: పర్యావరణాన్ని రక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని, విద్యార్థులు వారి భవిష్యత్‌ను కాపాడుకునేందుకు పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఓజోన్ పొరపై అవగాహన కల్పిస్తూ మొక్కల్ని నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించారు. సూరుడు నుండి వచ్చే అతి నీలలోహిత కిరణాలు నేరుగా భూమిమీద పడకుండా ఓజోన్ పొర అడ్డుకుంటుందన్నారు. ఓజోన్‌పొరకు రంధ్రం ఏర్పడితే కిరణాలు నేరుగా మనమీద పడి చర్మ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రసాయిన శాస్త్ర అధ్యపకులు ఏ. ఇందిర, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భీమవరంలో...

సాక్షి, భీమవరం: స్థానిక పీఎస్ఎమ్ గరల్స్ హైస్కూల్లో శనివారం విజ్ఞాన వేదికసేవాసంస్థ, నేషనల్ గ్రీన్‌కోర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓజోన్ పొరను కాపాడు కోవాలంటు వేసిన చిత్రలేఖనం, జోన్ యొక్క సాంకేతిక ఫార్ములా వో3(0.3) నమూనాను గొడుగులతో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జె.సుధారాణి, ఎన్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ మాధవిలత, అల్లు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వారణాసి రాధాకృష్ణ, మాధవీలత, మహాలక్ష్మి, అన్నామని తదితరులు పాల్గొన్నారు.

కలవపుడి సొసైటీకి అభినందనలు



డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ చేతులు మీదుగా మెమెంటో అందుకుంటున్న దృశ్యం

కాళ్ల: కలవపూడి సొసైటీ పరిధిలో రైతుల నుంచి నూటికి నూరు శాతం బకాయిలు వసూలు చేసినందుకు గాను జిల్లా కేంద్ర బ్యాంక్ చైర్మన్ పీవీఎల్ నరసింహారావు అభినందించినట్లు కలవపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బర్రె గంటయ్య సీఈవో కనుమూరి మణి తెలిపారు. జిల్లా కేంద్రం ఏలూరులో జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగిన మహాజన సభలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అభినందించి మేమంటూతో సత్కరించాలని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రతి ఏడాది సొసైటీ ద్వారా రైతుల నుంచి నూరు శాతం బకాయిలు వసూలు చేయడం కాకుండా రైతులకు విశేష సేవలు అందించడం పట్ల ఆయన అభినందించినట్లు వారు తెలిపారు. దీంతో సొసైటీ పరిధిలో రైతులు పెద్దలు డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాపునేస్తం..లబ్ధిదారుల ఆనందం



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాపు మహిళలు, వైసీపీ నాయకులు

ఆకివీడు: ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డికి కాపు జాతి రుణపడి ఉంటుందని పలువురు మహిళలు పేర్కొన్నారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో కాపునేస్తం పొందిన మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కాపులకు సంక్షేమ పథకాలు ఎర చూపాయని విమర్శించారు. ఐదేళ్ల పదవీ కాలంలో కాపు పథకాలు ఎండమావిలా మారాయని ఆరోపించారు. పాదయాత్రలో కాపుల ఆర్థిక స్థితిగతుల్ని పరిశీలించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఏడాది నుంచే కాపు నేస్తం పథకాన్ని అమలుజేసి నాలుగేళ్లుగా కాపు మహిళలకు రూ.15 వేలు చొప్పున ఇప్పటికి రూ. 60 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారని చెప్పారు. కాపులకు అన్ని విధాలుగా ఆర్థిక చేయూతనిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి కాపు జాతి రుణపడి ఉంటుందన్నారు. ప్రతీ ఏడాది కాపు నేస్తం పథకానికి 45 ఏళ్లు నిండిన మహిళలు అర్హత పొందుతూ పథకంలో చేరి రూ. 15 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. నాలుగేళ్లుగా కాపునేస్తం అందుకున్న కొల్లు సత్యవతి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న కాపులకు కాపునేస్తం ద్వారా జగన్ ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమన్నారు. కులం, మతం, పార్టీ చూడని జగన్ పేదల అభివృద్ధికి చేస్తున్న కృషికి 2024 ఎన్నికల్లో ఆయన్ని మళ్లీ గెలిపించి సీఎంను చేయాలని ఆమె ఆకాంక్షించారు. మరో మహిళ మెంటే బుజ్జి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు తమకు ఎంతో మేలు చేశాయని చెప్పారు. రైతుభరోసా, కాపు నేస్తం, సున్నావడ్డీ, ఆసరా వంటి పథకాల్ని అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్ విజయం సాధించే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు, ఏఎంసీ డైరెక్టర్ మెంటే మరియమ్మ, వైసీపీ నాయకుడు పన్నాసి వెంకన్న, దేవస్థానముల చైర్మన్లు నంద్యాల శివ, నూకల సత్యనారాయణ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఐఈఎల్‌టీఎస్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



ఐఈఎల్‌టీఎస్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అంతర్జాతీయ విద్యాసంస్థల్లో చేరేందుకు ముందుగా నిర్వహించే ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టం (ఐఈఎల్‌టీఎస్) పరీక్షల్లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 80 మంది అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు చెప్పారు. ఈ నెల 2న నిర్వహించిన పరీక్షా ఫలితాలు శనివారం విడుదలైన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సంస్థ రాష్ట్రంలో ప్రప్రథంగా ఐఈఎల్‌టీఎస్ టెస్ట్ సెంటర్‌ను తమ కళాశాలకు కేటాయించిందన్నారు. అంతర్జాతీయ విద్యాసంస్థల్లో చేరే విద్యార్థులకు ఈసెంటర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, బీహెచ్‌వీ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

పెనుమంట్ర: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని విజయవంతం కావడానికి ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని పెనుమంట్ర ఎంపీడీఓ పి.పద్మజ అన్నారు. శనివారం పెనుమంట్ర మండలం నెగ్గిపూడి గ్రామంలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను సంబంధిత సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. అలాగే నెగ్గిపూడి పంచాయతీ కార్యాలయ రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడిశెట్టి ధన లక్ష్మి, ఉపసర్పంచ్ సాయిరెడ్డి, వార్డు సభ్యులు గుత్తుల సాల్మన్‌దొర, కొవ్వూరి సీతా వెంకటనాగ లక్ష్మి, కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0



భీమవరం రైల్వే అండర్ పాస్‌లో పెయింటింగ్స్ వేస్తున్న విద్యార్థులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ వారి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం భీమవరంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల పర్యవేక్షణలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గరగపర్రు రోడ్డులోని రైల్వే అండర్ టన్నెల్ లోపల గోడలపై మున్సిపల్ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థులతో ఇరువైపులా వాల్ పెయింటింగ్స్ వేయించారు. అలాగే ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా గునుపూడి సోమేశ్వరస్వామి వారి దేవస్థానం ఎదరుగా ఉన్న సోమగుండం చెరువు చుట్టూ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించేందుకు, శుభ్రత పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. చెరువు చూట్టు ఉన్న మొక్కలు, గడ్డిను విద్యార్థులు, మున్సిపల్ కమిషనర్ శ్యామల, ఉద్యోగులు, స్థానికులు కలిసి తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ బి.ఆదినారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, ఏఎస్ఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పాలకోడేరు: పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు అన్నారు. వేంద్ర అగ్రహారం గ్రామంలో తడి, పొడి చెత్త బుట్టలను శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి యజమాని ఇంట్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడలి విజయలక్ష్మి సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ఐ నాగభూషణం నాయుడు, సచివాలయ కార్యదర్శి కడలి భవాని, వీఆర్వో మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



భీమవరం: మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తున్న ఆర్డీఓ దాసి రాజు



భీమవరం అర్బన్: గాంధీనగర్‌లోని పర్యావరణ పరిరక్షణపై కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పర్యావరణ పరిరక్షణకు అంతా సమష్టిగా కృషి చేయాలనీ భీమవరం ఆర్డీవో దాసి రాజు అన్నారు. జైత్ర బిజినెస్ సొల్యూషన్స్, వెస్ట్ బెర్రీస్కూల్ ఆధ్వర్యంలో శనివారం 5 వేల మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలనే సంకల్పంతో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జైత్ర బిజినెస్ సొల్యుషన్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నడింపల్లి వెంకట సుబ్బరాజు మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, గాదిరాజు సుబ్బరాజు, నడింపల్లి మహేష్‌కుమార్‌వర్మ, నడింపల్లి వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

భీమవరం అర్బన్/ భీమవరం (ప్రకాశం చౌక్): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలు చేసి పూజించాలని కళాకారుడు ఎం.కుమార్ అన్నారు. భీమవరంలోని గాంధీనగర్ మెయిన్‌రోడ్డు, పలు కూడలిలో ఏలూరు ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం కళాజాత ద్వారా పర్యావరణం పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

పాలకొల్లు అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మాసోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని లజపతిరాయపేట మాంటిస్సోరీ స్కూల్‌లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, షీల్డులు అందజేయనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామమోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రావాడ సతీష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల చట్టాలను అమలు చేయాలి

పాలకొల్లు సెంట్రల్: దివ్యాంగులపై జాలి చూపించడమే కాదని తమకు ఉన్న ప్రత్యేక హక్కులను కలిస్తూ, సామాజిక సమానత్వం సాధన కోసం ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని దివ్యాంగ మహాసంఘటన్ జాతీయ అధ్యక్షులు సండూరి రమేష్ తెలిపారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్లో సిఐ దారా వత్తు రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల సమస్యలపై పోలీసులు స్పందిస్తున్న తీరు చాలా ఆనందంగా ఉందన్నారు.